క్లుప్తంగా

గుడి నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చిలుకూరి వంశస్థులు

జే.పంగులూరు: మండల కేంద్రం పంగులూరులో చిలుకూరి వంశస్తుల దేవర గుడి నూతన నిర్మాణానికి ఆదివారం భూమి పూజ జరిగింది. తెనాలికి చెందిన ప్రముఖ వేద పండితులు వేముల శ్రీహరి, త్రినాథ్‌ల నేతృత్వంతో ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కోటి రూపాయల వ్యయ అంచనాతో నిర్మించ తలపెట్టిన ఈ ఆలయ నిర్మాణానికి ప్రవాసాంధ్రుడు కొణకంచి రాము 10 సెంట్లు, చిలుకూరి పెద్దబ్బాయి 5 సెంట్ల స్థలం ఉచితంగా సమకూర్చారు. హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో చిలుకూరి వంశస్తులు వీరరాఘవయ్య, మేడ సుబ్బారావు, ప్రసాదనాయుడు, రామాంజనేయులు, కోటయ్య, మల్లవరం సర్పంచ్ వీరయ్య, చిలుకూరి రామారావు, హరికృష్ణ, చైతన్యలతో పాటు పలువురు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

వరలక్ష్మీ వ్రతాలతో సౌభాగ్యం



వ్రతాలు చేస్తున్న మహిళా భక్తులు

అద్దంకి: వరలక్ష్మీ వ్రతాలను చేయడం వల్ల కుటుంబ అభివృద్ధితోపాటు మహిళలకు సౌభాగ్యం కలుగుతుందని తిరుమల, తిరుపతి దేవస్థాన దాస సాహిత్య జిల్లా కో ఆర్డినేటర్ సీహెచ్ నాగేశ్వరరావు అన్నారు. టీటీడీ ధర్మప్రచాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని శంకవరప్పాడు (రెడ్డిపాలెం) గ్రామంలోని అడిగొప్పల లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారి దేవస్థాన బాధ్యుడు జిలుగు రోశిరెడ్డి, జిలుగు నాగ శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకుడు అమ్మవారి ఉపాసకురాలు వెంకటలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. వ్రతాల్లో పాల్గొన్న వారందరికీ పూజలకు అవసరమైన ద్రవ్యాలను అందజేశారు. దానిలో భాగంగా టీటీడీ ధర్మాచార్యులు మాదాల దానయ్య మాస్టారు వరలక్ష్మీ వైభవం గురించి వివరించారు. అనంతరం టీటీడీ నుంచి పంపిన శ్రీలక్ష్మీ అమ్మవారి రూపులు, పసుపు, కుంకుమ, కంకణాలు, అక్షతలు, స్వామివారి పుస్తకాలు, అందజేశారు. కార్యక్రమంలో పుట్టా వీరాంజనేయయులు, పెద్దిశెట్టి వెంకటాద్రి, స్థానిక టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు భజన మండలి సభ్యులు, పాల్గొన్నారు.

మొక్కలతో మనసుకు ఆహ్లాదం



మొక్కలు నాటుకున్న ప్రసాద్, తదితరులు

పర్చూరు (చినగంజాం): మొక్కలతో మనసుకు ఆహ్లాదం లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం పర్చూరులోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ రావువారి వెంకట శివప్రసాద్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో కడియం నుంచి తెప్పించిన ఉసిరి, జామ, మామిడి, సపోట తదితర రకాలకు చెందిన 25 మొక్కలు నాటారు. కార్యక్రమంలో న్యాయవాది ఒగ్గిశెట్టి గోవింద రాజులు, గ్రామస్తులు ఆర్ రామారావు, బోగాది సీతా రామయ్య, కొసనా సురేష్, పెంట్యాల లక్ష్మి, చందు లక్ష్మి, బోగాది ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

ముఖ మండప నిర్మాణానికి విరాళం



ఆలయ ఏసీకి విరాళం అందజేస్తున్న దాత

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మంటప నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయి. దానిలో భాగంగా ఆదివారం నెల్లూరుకు చెందిన వల్లెపు వెంకటేశ్వర్లు, దుర్గమ్మ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సంజీవరావు, నాగాంజమ్మ రూ.1 లక్ష విరాళాన్ని ఆలయ ఏసీ సుభద్రకు అందజేశారు.

డోంట్ వర్రీ.. మద్యం డోర్ డెలివరీ

- గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు
- ఫోన్ చేస్తే చాలు మద్యం కోరుకున్న చోటుకి
- గుడి, బడి తేడా లేకుండా మద్యం అమ్మకాలు
- పర్చూరు సెబ్ పరిధిలో ప్రభుత్వ దుకాణ సిబ్బంది కొత్త ట్రెండ్
- చోద్యం చూస్తున్న అధికారులు



పూనూరులో గాంధీ విగ్రహం అరుగుపై పడి దొర్లుతున్న మందుబాబు (ఫైల్)

యద్దనపూడి: కూటమి ప్రభుత్వం వచ్చింది కదా. ఇక మందుబాబులకు హద్దూ అదుపూ లేకుండా పోతోంది. సాక్షాత్తు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం మంచి నాణ్యమైన మద్యం అందిస్తాం. మేరేం దిగులుపడొద్దని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. మూడునెలలు పూర్తయ్యాయి కాని కొత్త మద్యం పాలసీ ఊసేలేదు. ఆలోపు మద్యం షాపుల నిర్వాహకులే తెగబడుతున్నారు. బడి, గుడి, బంకు, బైకు కాదేది మద్యం సరఫరాకు అనర్హం అంటూ నేడు నిరూపిస్తున్నారు కొందరు బెల్టుషాపుల నిర్వాహకులు. దీని కోసం కొందరు అధికారులు పబ్లిక్‌గానే బెల్టుషాపులకు అనధికారికంగా మద్దతు ఇస్తుండటాన్ని చూసి ఆయా గ్రామాల్లోని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పర్చూరు నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం విచ్చలవిడిగా ఏరులై పారడటమే ఇందుకు నిదర్శనం. కొన్ని చోట్ల ప్రభుత్వ దుకాణాల్లో పని చేసే సిబ్బందే నేరుగా బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తుండటం గమనార్హం. ఇక నుంచి మద్యాన్ని ఆన్‌లైన్ ద్వారా డోర్‌డెలివరీ చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ప్రకటించడాన్ని ఆదర్శంగా తీసుకున్నారో ఏమో కానీ చాలా మంది బెల్టుషాపు నిర్వాహకులు దానిని ముందుగానే ఆచరణలో పెట్టటం గమనార్హం. మందు ప్రియులు ఫోన్ చేస్తే చాలు 5 నిమిషాల్లో మందు వారు కోరుకున్న చోటుకి డోర్ డెలివరీ చేస్తున్నారంటే గ్రామాల్లో మందు అమ్మకాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు..

నియోజకవర్గంలోని పర్చూరు సెబ్ పరిధిలో యద్దనపూడి, మార్టూరు, పర్చూరు, ఇంకొల్లు మండలాల పరిధిలో ప్రభుత్వ మద్యం దుకాణాలు 16 ఉన్నాయి. ఆయా మండలాల్లోని గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, సిబ్బంది, ఎవరికి వారే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటంతో గ్రామాల్లోని ఆలయాలు, సెంటర్లు, పాఠశాల పరిసరాలు, రోడ్లవెంబడి, బస్‌షెల్టరు వంటి పరిసర ప్రాంతాలు మందు బాబులకు అడ్డాగా మారాయి. దీంతో ఆయా మార్గాల్లో నడవాలంటేనే మహిళలు, వృద్ధులు, చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలోని నడిబొడ్డున గల దేవాలయ పరిసరాలు మందుబాబులకు అడ్డాగా మారటంతో దేవాలయానికి వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగిన ఖాళీ మద్యం సీసాలను ప్రహరీ మీదుగా ఆలయంలోకి విసరడం వంటివి చేస్తుండటంతో ఆలయ పవిత్రత దెబ్బతింటుందని భక్తులు వాపోతున్నారు. మందు డోస్ ఎక్కువైన కొందరు మందుబాబులు సెంటలో ఉన్న గాంధీ విగ్రహం ఉన్న అరుగుపైనే దొర్లుతుండటం పరిపాటిగా మారింది. అలాగే రెస్టారెంట్ ముసుగులో అనధికారికంగా రాత్రి 1 గంటల వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.



బస్‌షెల్టర్ వద్ద తాగిపడేసిన ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులు

మద్యం రవాణా ఇలా..

వాస్తవానికి మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరకే మద్యం విక్రయించాల్సి ఉన్నందున్న ప్రభుత్వ దుకాణాల్లోని కొందరు సిబ్బందే బెల్టుషాపుల నిర్వాహకులతో చేయి కలిపి ఒక్కో సీసాపై రూ.10 నుంచి రూ.20 చొప్పున తీసుకొని మందును అందజేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 3 సీసాలు మాత్రమే విక్రయిస్తారు. దీంతో కొంతమంది బెల్టుషాపు నిర్వాహకులు తమకు సంబంధించిన వ్యక్తులను షాపుల వద్దకు తీసుకువెళ్లి వారిచే పలుమార్లు షాపుకు పంపి మద్యాన్ని తెప్పిస్తున్నారు. అలా సేకరించిన వ్యక్తులకు ప్రతిఫలంగా బెల్టు నిర్వాహకులు నగదో లేక మద్యమో పోస్తున్నారు. అలా సేకరించిన మందును సీసాకు రూ. 50 నుంచి రూ.60 వరకు అదనంగా నిర్వాహకులు అమ్ముకుంటున్నారు. ముఖ్యంగా మద్యం ప్రియులకు ఎక్కువగా వాడే బ్రాండ్‌లను ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసే సిబ్బంది కృత్రిమ కొరత సృష్టించి ఆయా బ్రాండ్‌ల మద్యం సీసాలను బెల్టుషాపు నిర్వాహకులకు అమ్ముకుంటున్నారు. దీంతో మద్యం ప్రియులు అధిక ధర వెచ్చించి బెల్టు షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు.

> **బెల్టుషాపు నిర్వహిస్తే కఠిన చర్యలు..**
>
> ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం అమ్మకాలు జరపాలి. జనవరి నుంచి ఇప్పటి వరకు అక్రమ మద్యం విక్రయిస్తున్న 127 మందిపై కేసులు నమోదు చేశాం. నిబంధనలు అతిక్రమించి మద్యం అనధికారికంగా విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే 94409 02496 నంబరుకు ఫోన్ చేయండి. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. అలాగే బెల్టుషాపు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> ఎం. భుజంగరావు,
> సెబ్ సీఐ, పర్చూరు

కన్నెత్తి చూడని అధికారులు..

బెల్టుషాపు నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామని చెప్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో బెల్టుషాపులు కొనసాగుతున్నా పట్టించుకున్న పాపాన పోవడంలేదు. తగ్గినంత సిబ్బంది లేరంటూ సెబ్ అధికారులు, రాజకీయంగా ఒత్తిళ్ల వస్తాయి మనకెందుకు అంటూ పోలీసులు నిద్ర నటిస్తూ అక్రమ మద్యం వ్యాపారానికి పరోక్షంగా సహకరించటమేనని ప్రజలు అధికారుల తీరును బహిరంగానే విమర్శిస్తున్నారు.

ఆరామక్షేత్ర గది ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పెద్దలు

అద్దంకి: పట్టణంలోని పాత శివాలయం వద్ద అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈకార్యాలయం ఆరామ క్షేత్రంపై భాగాన ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన ధర్మవరపు చారిటీస్ నుంచి రూ. 3లక్షలు ఇచ్చారు. ఆ నగదుతో గది నిర్మాణం పూర్తి కావడంతో ఆదివారం ప్రారంభించినట్లు సేవా సంఘ అధ్యక్షుడు జమ్మలమడక హనుమంతరావు చెప్పారు. ఆరామ క్షేత్రాన్ని అపర కర్మల కోసం బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆరామ క్షేత్ర ఆధునికీకరణ మొదటి అంతస్తు నిర్మాణానికి సుమారు రూ.19 లక్షలు విరాళాలుగా సేకరించి పూర్తిచేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఈదర శివప్రసాద్, కోశాధికారి ఐ నాగరాజు, పూర్వాధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ధర్మవరపు శ్రావణ్ కుమార్ సంఘ గౌరవ అధ్యక్షుడు లక్కరాజు చంద్రశేఖర్, చారిటీస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

వేటపాలెం: అర్ధరాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. శనివారం అర్ధరాత్రి చల్లారెడ్డిపాలెం శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక లోడును తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసి పోలీసు స్టేషన్‌కి తరలించినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన భానుడు

- ఎండలతో బెంబేలెత్తుతున్న జనం

వేటపాలెం: మామూలుగా ఆగస్టు నెలలో వర్షాలతో చల్లటి వాతావరణం నెలకొని ఉండేది. కాని వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఐదు రోజుల నుంచి ఎండ ప్రజలను ఊపిరాడకుండా చేస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు 37–38 డీగ్రీలకు చేరుకున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది మూడు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. ఉక్కపోత ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం వరకు ఉంటోంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వృద్ధులు చిన్నారులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి ఎండలు చూడలేదని ప్రజలు అంటున్నారు. ఈఎండలు చూస్తుంటే భానుడు సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించినట్లు అనిపిస్తుందంటున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు డ్యాంలు నిండుగా మారాయి. దీనితో కృష్ణా కెనాల్ నుంచి వరి సాగు కోసం అధికారులు కాలవలకు నీరు విడుదల చేశారు. రైతుల వరి సాగు కోసం నారు మళ్లు సిద్ధం చేసుకున్నారు. మరికొందరు నాట్లు వేయడానికి రైతులు పొలం బాట పట్టారు. అయితే ఈ ఎండల తీవ్రతకు రైతులు, రైతు కూలీలు బెదిరిపోతున్నారు.



భగభగమంటున్న సూర్యుడు

పెరిగిన ఏసీల వినియోగం..

ఎండల తీవ్రత, ఉక్కపోతతో ఒక వైపు ఫ్యాన్ తిరుగుతున్నప్పటికీ ఉక్కపోత ఆగడం లేదు. దీంతో మళ్లీ ఏసీలు ఆన్ చేసుకొని అందులోనే ఉండిపోతున్నారు. ఆగస్టులో ప్రతి ఒక్కరికీ కరెంటు బిల్లు మోతమోగిందని ఆందోళన చెందుతున్నారు.

ఎండలకు బెంబేలెత్తుతున్నాం



నాలుగైదు రోజుల నుంచి ఎండలు ఆదర గొడుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్రపోత ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. పొలం వెళ్లాలంటే భయమేస్తోంది.

– రామకృష్ణ, వేటపాలెం

ప్రారంభమైన రక్షాబంధన్ వేడుకలు


చీరాల టౌన్: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్. తమ్ముళ్లు బాగుండాలని అక్కలు, తమ అక్కలు సంపూర్ణ ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలని తమ్ముళ్లు ప్రతీ ఏడాది చేసుకునే రక్షా బంధన్ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు కొందరు తమ స్వగ్రామాలకు చేరుకోవడంతో సందడి నెలకొంది.



రాఖీ కడుతున్న సోదరి

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పర్చూరు (చినగంజాం): మండలంలోని ఇనగల్లు గ్రామంలో నేడు సోమవారం ఆంజనేయ స్వామి గ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని గ్రామ సర్పంచ్ నరిశెట్టి విపిన్ బాబు తెలిపారు. సోమవారం ఉదయం 8.45 గంటలకు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎస్ వెంకట రమణ, శ్రీనివాసరావు, రాంబాబు, వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొనున్నట్లు తెలిపారు.



విగ్రహ ప్రతిష్ఠ జరగనున్న ఆంజనేయస్వామి

రోటరీ 557వ నేత్రదానం



దాత జీ రత్తమ్మ (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామంలో 557వ నేత్రదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన గొట్టిపాటి రత్తమ్మ మృతి చెందడంతో ఆమె నేత్రాలను దానం చేశారు. ఆమె భర్త కుచేలుడు, కుమారులు స్వాములు, ఏడుకొండలు, కుమార్తె కుక్కపల్లి పద్మ, ఏడుకొండలు సహకారంతో గుంటూరు శంకర్ కంటి వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులను రోటరీ క్లబ్ ఇంకొల్లు సెంట్రల్ ఆవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రఫి, చుండి సాంబశివరావు, కుటుంబ సభ్యులను అభినందించారు.

మితిమీరిన వేగంతో ప్రాణాపాయం



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకట్రావు

కారంచేడు: అధిక లోడుతో మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రయాణికుల ప్రాణాలతో పాటు, ఆటో డ్రైవర్లు కూడా తమ ప్రాణాలు పోగొట్టుకుంటుంన్నారని ఎస్సై వీ వెంకట్రావు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఆయన మండల కేంద్రం కారంచేడు కాలువ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కారంచేడు నుంచి కుంకలమర్రు, పర్చూరు, స్వర్ణ, చీరాల ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసే ఆటో వాలాలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కారంచేడు నుంచి కుంకలమర్రు, స్వర్ణ గ్రామాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. రహదారికి రెండు వైపులా కాలువ ఉన్నాయన్నారు. అలాగే పర్చూరు, చీరాల వైపు ప్రయాణించే వారు సైతం ప్రధాన రహదారులు కాబట్టి నెమ్మదిగా ప్రయాణించాలన్నారు. వాహనాలకు సబంధించిన అన్ని రకాల రికార్డులు, పత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటోవాలాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాక్య పరిచర్యలో విశ్వవాణి కృషి

చీరాల రూరల్: నశించిపోయే ఆత్మలను రక్షించేందుకు దేవుని సువార్తను విశ్వ వ్యాప్తంగా అందించేందుకు విశ్వవాణి విశేషంగా కృషి చేస్తున్నదని విశ్వవాణి తెలంగాణా రాష్ట్ర కోఆర్డినేటర్ రెవరెండ్ ఈ రఘయేలు రాబర్ట్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో విశ్వవాణి సండేను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ఆరాధన క్రమాలన్నింటిని విశ్వవాణి నిర్వహకులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్ రెవరెండ్ పిల్లి దేవదాసు, రెవరెండ్ నానిబాబులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాబర్ట్ దేవుని వాక్య సందేశాలు అందించారు. దేవుని సువార్తను ప్రకటించడంలో వాక్య పరిచర్యలో విశ్వవాణి ఎంతో విశేషంగా కృషి చేస్తున్నదని చెప్పారు. ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ సంఘాలతో పాటు ఇతర క్రిష్టియన్ సంఘాలతో కలసి విశ్వవాణి మమేకమై పనిచేస్తుందన్నారు. దేశంలోని 10,500 గ్రామాల్లో 4,737 మంది విశ్వవాణి సేవకులు వందల కొలది సంఘాలు ఏర్పాటుచేసి ఎంతో వ్యయప్రయాసలతో కూడిన సేవలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్, ఎల్‌సీసీ, పీసీసీ, స్త్రీల సమాజం, యూత్, సంఘస్థులు పాల్గొన్నారు.



రఘయేలు రాబర్ట్

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జే.పంగులూరు: ఉచితంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు, శంకర్ కంటి ఆసుపత్రి గరిమిడి జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని ముప్పవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 145 మంది హాజరయ్యారు. వైద్యులు వీరిని పరీక్షించి అందులో 90 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. శిబిరాన్ని రేణింగవరం ఎస్సై బీ వినోద్‌బాబు ప్రారంభించారు. శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బిపిన్, డాక్టర్ ఉష, డాక్టర్ మారియాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంగులూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కాలేషవలి, సెక్రటరీ బత్తుల వీరనారాయణ, కోశాధికారి జాగర్లమూడి సుబ్బారావు (జేకేసీ), రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు కరణం హనుమంతురావు, కుక్కపల్లి ఏడుకొండలు, అల్లం నేని బ్రహ్మానంద స్వామి, హెచ్‌ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో రావాలని ఎంపీడీవో సూచించారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్యార్థులు గ్రంథాలయాలు వచ్చి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు శాఖ లైబ్రేరియన్ బాదం విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే కథలు, దేశనాయకుల చరిత్రలకు సంబంధించిన వివిధ పుసకాలను చదివించారు. కార్యక్రమంలో 13 మంది పాల్గొన్నారు.



విద్యార్థుల చేత పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్

పర్యాటకుల సందడే సందడి

చీరాల టౌన్: వాడరేవు సముద్ర తీరం సందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో బాపట్ల జిల్లాలోని చీరాల, పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లోని గ్రామాలతో పాటుగా తెలంగాణ రాష్ట్రంలోని హైద్రాబాద్, పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికసంఖ్యలో వాడరేవుకు చేరుకున్నారు. సముద్రంలో కేరింతలు కొడుతూ స్నానాలు ఆచరించారు. తీరంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా సివిల్, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



సముద్రంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

దాయాదుల మధ్య ఘర్షణ

మార్టూరు: భూమి సరిహద్దుల విషయమై రాయాదుల మధ్య మొదలైన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈఘటన మండలంలోని కోనంకి గ్రామంలో ఆదివారం జరిగింది. అందిన వివరాల మేరకు.. కోనంకి గ్రామానికి చెందిన సమీప బంధువులైన దాయాదుల మధ్య గత కొంతకాలంగా భూవివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పొలం దగ్గర ఓవర్గానికి చెందిన వారిపై మరో వర్గం దాడి చేయగా ఒకరికి గాయాలయ్యాయి. ఇరు వర్గాలు పోలీసు స్టేషన్‌కు చేరుకునే క్రమంలో కోనంకికి చెందిన గ్రామపెద్దలు వారి మధ్య రాజీ చేసి సమస్యను పరిష్కరించడంతో సమస్య సద్దు మణిగింది.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

స్వర్ణ (కారంచేడు): రహస్య ప్రదేశాల్లో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశామని ఎస్సై వీ వెంకట్రావు తెలిపారు. ఆదివారం మండలంలోని స్వర్ణ గ్రామంలోని పశువుల కొష్టాల వద్ద పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు. అక్కడ పేకాట ఆడుతున్న గ్రామానికి చెందిన ఎనిమిది మందిని అరెస్టు చేసి రూ.3490 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎక్కడైన జూదం, కోడిపందేలు నిర్వహిస్తే 91211 02145 నంబర్‌కు తెలపాలని ఆయన కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com